# సాక్షి తిరుపతి

మంగళవారం । 8 । జూలై । 2025






**రేషన్ షాపులపై విజిలెన్స్ దాడులు**

తిరుపతి నగరంలో విజిలెన్స్ అధికారులు రేషన్ షాపులపై దాడులు చేసి, అదనంగా వున్న స్టాక్‌ను సీజ్ చేశారు. - 8లో

**విద్యా ప్రదాత వైఎస్సార్**

తిరుపతిని ఎడ్యుకేషనల్ హబ్‌గా మార్చిన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్సార్‌ను, ఆయన జయంతి సందర్భంగా స్మరించుకుందాం.



- 8లో



**పోలీస్ గ్రీవెన్స్‌కు 97 అర్జీలు**

నగరంలోని తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి ఎస్పీ హర్షవర్ధన్ రాజు అర్జీలు స్వీకరించారు. - 8లో

# జగన్ పర్యటనపై కుట్రలు

- చంద్రబాబు డైరెక్షన్‌లో మంత్రి నారా లోకేష్ సమక్షంలోనే పన్నాగం
- జగన్‌తో వాదనకు దిగాలంటూ టీడీపీ ఎమ్మెల్యేలకు ఆదేశాలు
- శాంతి భద్రతల సమస్య సృష్టించాలనే కుతంత్రం
- జగన్ పర్యటనకు భద్రత కల్పించాల్సిన బాధ్యత పోలీసులదే
- కూటమి నేతలపై మండిపడిన భూమన కరుణాకరరెడ్డి



మాట్లాడుతున్న భూమన కరుణాకరరెడ్డి

**తిరుపతి మంగళం:** పూతలపట్టు నియోజకవర్గంలోని బంగారుపాళేనికి ఈ నెల 9వ తేదీన వస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని అడ్డుకునేందుకు టీడీపీ ఎమ్మెల్యేలను ఉసిగొలిపి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి మండిపడ్డారు. తిరుపతి క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు డైరెక్షన్‌లో మంత్రి నారా లోకేష్ సమక్షంలోనే టీడీపీ ఎమ్మెల్యేలు వైఎస్ జగన్‌ను అడ్డుకుని, శాంతిభద్రతల సమస్యలను సృష్టించాలనే అంశంపై సమాలోచనలు చేశారని వెల్లడించారు. మామిడి రైతుల పక్షాన నిలబడటాన్ని కూడా రాజకీయం చేయడం ఏమిటని ప్రశ్నించారు. టీడీపీ ఎమ్మెల్యేల కుట్రలను గమనించి, జిల్లా పోలీస్ అధికారులు వైఎస్ జగన్ పర్యటనకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని కోరారు. ఇంకా ఆయనేమన్నారంటే...

వైఎస్ జగన్ మామిడి రైతులను పరామర్శించేందుకు వస్తున్నారని తెలిసినప్పటి నుంచి టీటీడీ ఎమ్మెల్యేలు, మంత్రులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారు. వైఎస్ జగన్ పర్యటనను అడ్డుకుంటామని స్థానిక ఎమ్మెల్యే మురళీమోహన్ సహా పలువురు బెదిరింపు ధోరణితో మాట్లాడారు. వైఎస్ జగన్ పర్యటనలో అలజడి, శాంతిభద్రతల సమస్య సృష్టించి తద్వారా లబ్ధి పొందాలనే కుట్ర చంద్రబాబు, నారా లోకేష్ కనుసన్నల్లోనే జరుగుతోంది.

**జన సమీకరణ చేయడం లేదు**

వైఎస్ జగన్ పర్యటన కోసం వైఎస్సార్‌సీపీ నేతలు ఎవరూ జనసమీకరణ చేయడం లేదు. ఆయన ఎక్కడకు వెళ్లినా పెద్ద సంఖ్యలో ప్రజలు ఆయన వెంట నడుస్తుంటారు. కానీ టీడీపీ ఎమ్మెల్యేలు నేరుగా ఆయన పర్యటనను అడ్డుకుని, ఆయనతో వాదనలకు దిగుతామని చేస్తున్న ప్రయత్నాలను పోలీసులు అడ్డుకోవాలని జిల్లా ఎస్పీని కోరుతున్నాం. వైఎస్ జగన్‌కు రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీసులపైనే ఉంది. టీడీపీ ఎమ్మెల్యేల ప్రశ్నలకు సమాధానాలు చెప్పేందుకు వైఎస్ జగన్ అక్కరలేదు, ఈ జిల్లాకు చెందిన పార్టీ నాయకుడు అయినా సరిపోతారు. చిత్తూరు జిల్లా నుంచి ఎన్నికై, సీఎంగా ఉన్న చంద్రబాబు ఈ ప్రాంత మామిడి రైతులను ఆదుకునేందుకు ఏ నాడు దృష్టి సారించకపోవడం వల్లే నేడు రైతులు ఈ దుస్థితిలో ఉన్నారు. మామిడిని కొనేవారు లేక, రోడ్ల మీద పోసి రైతులు వెళ్లిపోతున్నారు. అంతేకాకుండా ఈ ప్రభుత్వం మమ్మల్ని ఆదుకుంటుందనే నమ్మకం లేక మామిడి తోటలనే నరికేసుకుంటున్నారు. ఇలా నరికేసుకుంటున్న రైతులపై అటవీశాఖ అధికారులను ఉసికొల్పి, తప్పుడు కేసులు నమోదు చేయడం, వేల రూపాయలు జరిమానాలు విధించడానికి ఈ ప్రభుత్వానికి మనసెలా వస్తోంది? వైఎస్ జగన్ ఈ జిల్లాకు వస్తున్నందున మామిడి రైతులు సంతోషంగానే ఉన్నారని చూపించడానికి ఇటువంటి నీచానికి పాల్పడతారా?.

**ఇది వైఎస్ జగన్‌పై దాడిగానే పరిగణిస్తాం**

రైతులకు బాసటగా నిలిచేందుకు వస్తున్న మాజీ సీఎంపై టీడీపీ ఎమ్మెల్యేలను ఉసిగొల్పే ప్రయత్నం కూడా ఆయనపై దాడిగానే భావిస్తున్నాం. టీడీపీ ఎమ్మెల్యేలు తమ వాదనలు వినిపించడానికి అనేక వేదికలు ఉన్నా కూడా నేరుగా వైఎస్ జగన్‌పై దాడి చేయడానికి సిద్ధమవుతుండడం దౌర్భాగ్యం. జిల్లాలో దాదాపు 1.05 లక్షల టన్నుల మామిడి పంట పల్ప్ ఫ్యాక్టరీలకు వెళితే, ఇంకా 1.70 లక్షల టన్నులు మామిడి కొనేవారు లేరు. రైతుల కష్టాలను పట్టించుకోకుండా, వారికి అండగా నిలబడే వారిపైనే దాడికి పాల్పడతామని అధికార పార్టీ ఎమ్మెల్యేలు బెదిరింపులకు దిగుతున్నారు.

**వైఎస్ జగన్ హయాంలో కిలో రూ.22**

'సీఎం పల్ప్ ఫ్యాక్టరీలతో సమావేశం నిర్వహించారు. రైతులను ఆదుకుంటున్నామని, వైఎస్ జగన్ హయాంలో మామిడి రైతులకు ఎటువంటి మేలు చేయలేదంటూ మాపైన ఆరోపణలు చేశారు. కానీ వైఎస్ జగన్ పాలనలో సగటున కిలో మామిడికి రూ.22 గిట్టుబాటు ధర కల్పించారు. ఆనాడు రైతులు ఎవరూ గిట్టుబాటు ధర లేదంటూ ఇప్పుడు చేస్తున్నట్లుగా ఆందోళనలు చేయడం, రోడ్ల మీదకి రావడం జరగలేదు. ఇప్పుడు చిత్తూరు జిల్లాలో జరుగుతున్న మామిడి రైతుల ఆందోళనలు, ఆదుకోవడంలో ప్రభుత్వ వైఫల్యాలను చూసి, చలించిన వైఎస్ జగన్ ఒక బాధ్యత గల ప్రతిపక్ష నేతగా రైతులకు భరోసా కల్పించేందుకే బంగారుపాళ్యంకు వస్తున్నారు. ఆయన వస్తున్నారని తెలిసిన తరువాతే కిలోకు రూ.6 ఇస్తామంటూ రైతులకు టోకెన్లు జారీ చేస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం ఇస్తానంటున్న రూ.4కు సంబంధించి ఎటువంటి చెల్లింపుల జాడలేదు. కర్ణాటకలో 2.50 లక్షల టన్నుల మామిడిని కేజీ రూ.16 చొప్పున కొనుగోలు చేయించేందుకు కేంద్రప్రభుత్వం నుంచి హామీ పొందారు. కానీ ఇక్కడి సీఎం చంద్రబాబు కేంద్రానికి ఒక్క లేఖ కూడా రాయలేదు. దీనికి టీడీపీ ఎమ్మెల్యేలు ముందు సమాధానం చెప్పాలి.' అని భూమన కరుణాకర రెడ్డి డిమాండ్ చేశారు.

# జగన్ అంటే అంత భయమెందుకో!

- సాధారణ జనాల్లోనూ జగన్ పర్యటనపై చర్చ
- వైఎస్ జగన్ రాక కోసం రైతుల ఎదురుచూపు
- కర్ణాటకలోనూ జోరుగా చర్చ



**పలమనేరు:** మామిడి రైతుల బాధలను చూసి వారికి అండగా నిలిచి, గిట్టుబాటు ధర కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు ఈ నెల 9వ తేదీన జిల్లా లోని బంగారుపాళెం మామిడి మార్కెట్ వద్దకు మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విచ్చేస్తున్నారు. ఇందుకోసం జిల్లా వాసులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పర్యటకు ప్రభుత్వం హెలీక్యాప్టర్‌కు అనుమతులివ్వకుండా ఆంక్షలు పెట్టిన విషయం తెలిసిందే. దీంతో ఆయన రైతుల బాధల వినడానికి తాను బెంగళూరు నుంచి రోడ్డు మార్గంలో బంగారుపాళేనికి వస్తానని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లా వాసులే కాదు పొరుగునే ఉన్న కర్ణాటకలోని హొసకోటె, కోలార్, ముళబాగిళు, నంగిళి ప్రాంతాల్లోనూ జగన్‌మోహన్‌రెడ్డి రాక కోసం ఎదురుచూస్తున్నారు. బుధవారం రోడ్డు మార్గంలో ఏపీ మాజీ సీఎం వస్తున్నాడని తెలిసి ఇప్పటికే భారీ సంఖ్యలో కర్ణాటక వాసులు రోడ్డు పక్కన బ్యానర్లకు ఆర్డర్ ఇచ్చేశారు. కర్ణాటకలోనూ స్వాగతం పలికేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మరోవైపు జిల్లా లోని పడమటి ప్రాంత రైతులు, వైఎస్సార్‌సీపీ అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో బంగారుపాళెంలో హెలీప్యాడ్‌కు అనుమతులు ఇస్తున్నామని అధికారులు చెబుతున్నారు. ఇంతకీ రైతుల కష్టాల కోసం జగన్ వస్తే కూటమి ప్రభుత్వం ఎందుకు హడలిపోతుందనే ప్రశ్న తలెత్తుతోంది.

**అనుమతి వెనుక ఇంత తతంగమా?**

బెంగళూరు నుంచి బంగారుపాళెం వరకు దాదాపు 150 కిలోమీటర్లు జగన్‌మోహన్‌రెడ్డి రోడ్డు మార్గంలో వస్తే హైవేలో పెద్దసంఖ్యలో వాహనాలు, భారీగా తరలివచ్చే జనంతో వైఎస్సార్ సీపీకి జాతీయ స్థాయిలో భారీ మైలేజీ వస్తుందని నిఘా వర్గాలు ఇప్పటికే ఉన్నతాధికారులకు సమాచారం చేరవేసినట్టు తెలిసింది. దీంతో హెలిప్యాడ్‌కు అనుమతిలిస్తేనే మేలని ఉన్నతాధికారులు భావిస్తున్నట్టు తెలుస్తోంది. చేసేది లేక అధికారులు హెలిప్యాడ్‌కు అనుమతులు ఇచ్చారనే మాట ఇప్పుడు జనం నోట నానుతోంది. ఏదేమైనా జగన్‌మోహన్‌రెడ్డి ఎలా వచ్చినా బంగారుపాళెం కార్యక్రమానికి వెళ్లేందుకు జనం సిద్ధంగా ఉండడం విశేషం.

## వైఎస్. జగన్ పర్యటన రేపు

**చిత్తూరు అర్బన్:** మాజీ సీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం జిల్లాలో పర్యటిస్తారని ఆ పార్టీ నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మామిడి రైతులు పడుతున్న కష్టాన్ని తెలుసుకోవడానికి బంగారుపాళెం మార్కెట్ యార్డులో రైతులతో ముఖాముఖి నిర్వహించనున్నారు.

- ఉదయం10 గంటలకు బెంగళూరు నుంచి హెలిక్యాప్టర్‌లో బంగారుపాళేనికి బయలుదేరుతారు.
- 10.50 గంటలకు బంగారుపాళెం మండలం కొత్తపల్లె హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
- 11 గంటలకు హెలిప్యాడ్ నుంచి బయలుదేరి 11.20 గంటలకు రోడ్డు మార్గంలో బంగారుపాళెం మార్కెట్ యార్డుకు చేరుకుంటారు.
- 11.20 నుంచి 12.20 గంటల వరకు మామిడి రైతుల కష్టాలపై బంగారుపాళెం మామిడి యార్డులో రైతులతో నేరుగా మాట్లాడుతారు.
- 12.20 గంటలకు మార్కెట్ యార్డు నుంచి బయలుదేరి 12.35 గంటలకు హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
- 12.45 గంటలకు బంగారుపాళెం కొత్తపల్లెలోని హెలిప్యాడ్ నుంచి బెంగళూరుకు బయలుదేరి, మధ్యాహ్నం 1.35 గంటలకు బెంగళూరుకు చేరుకుంటారు.

## న్యూస్‌రీల్

### వందశాతం హాజరు

**తిరుపతి అర్బన్:** పాఠశాలలు పునఃప్రారంభం నుంచి అంటే జూన్ 12 నుంచి జూలై 7 వరకు జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, జిల్లాలోని విద్యార్థులు వందశాతం హాజరు సాధించడంతో తిరుపతి జిల్లాకు ప్రత్యేక గుర్తింపు దక్కింది. దీంతో విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు, రీజనల్ జాయింట్ డైరెక్టర్ శామ్యూల్‌తోపాటు పలువురు రాష్ట్ర స్థాయి అధికారులు జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్‌తోపాటు తిరుపతి జిల్లా విద్యాశాఖను సోమవారం అభినందించారని డీఈవో ఓ ప్రకటనలో తెలిపారు.

### కౌన్సెలింగ్ ప్రారంభం



ఎస్వీయూలో రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న విద్యార్థులు

**తిరుపతి సిటీ:** ఎస్వీయూ పరిధిలో ఈఏపీసెట్–2025కు సంబంధించి ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు సోమవారం నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఎస్వీయూ కళాశాల భవనంలోనూ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోనూ కౌన్సెలింగ్ హెల్ప్ లైన్ సెంటర్లను ప్రారంభించారు. విద్యార్థులు ఈ నెల 16వరకు రిజిస్ట్రేషన్, ధ్రువపత్రాల పరిశీలన చేసుకోవాల్సి ఉంటుంది. ఈ నెల 13 నుంచి 18వ తేదీవరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. 19వ తేదీ ఆప్షన్స్ మార్పులకు అవకాశం ఇస్తూ ఈనెల 22న సీట్ల కేటాయింపు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

### మామిడి రైతులకు అండగా ఉంటాం

**తిరుపతి అర్బన్:** మామిడి రైతులకు అండగా ఉంటామని కలెక్టర్ వెంకటేశ్వర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 76,700 మంది రైతులు 80వేల హెక్టార్లలో తోతాపురి మామిడి పంట సాగు చేశారని చెప్పారు. అందులో తిరుపతి జిల్లాలో 14,582 హెక్టార్లలో సాగుచేస్తే 1.45 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చిందన్నారు. జిల్లాలో 8 గుజ్జు ప్రాసెసింగ్ యూనిట్లు, 39 ర్యాంప్‌లు, 3 మండీలు ఉన్నాయని వివరించారు. 8 యూనిట్ల సామర్థ్యం 1.21 లక్షల మెట్రిక్ టన్నులుగా పేర్కొన్నారు. ఈ క్రమంలో టన్ను రూ.12కి కొనుగోలు చేయడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. ఫ్యాక్టరీ వారు రూ.8కి కొనుగోలు చేస్తే, ప్రభుత్వం రూ.4 ఇస్తుందని చెప్పారు. అందరికీ న్యాయం చేయడానికి కృషి చేస్తామని తెలియజేశారు.

### శ్రీవారి దర్శనానికి 18 గంటలు

**తిరుమల:** తిరుమల శ్రీవారి సర్వదర్శనానికి 18 గంటల సమయం పడుతోంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ భక్తులతో నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 88,938 మంది స్వామివారిని దర్శించుకోగా 28,548 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.39 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

# కర్ణాటక భక్తులకు రైల్వేశాఖ తీపికబురు

- త్వరలో పట్టాలపైకి తిరుపతి–చిక్‌మంగళూరు ఎక్స్‌ప్రెస్





**తిరుపతి అన్నమయ్య సర్కిల్:** తిరుమల శ్రీవారి దర్శనార్థం తిరుపతికి వచ్చే కర్ణాటక భక్తులకు రైల్వేశాఖ తీపికబురు అందించింది. ఆంధ్ర, కర్ణాటక సరిహద్దులోని ప్రజల సౌకర్యార్థం కొత్తగా వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలెక్కనుంది. ప్రధానంగా బెంగళూరు, చిక్‌మంగళూరు, తుంకూరు ప్రాంతాల వారికి ఈ రైలు సౌకర్యంగా ఉంటుంది. తాజాగా కేంద్ర రైల్వేశాఖ తిరుపతి– చిక్‌మంగళూరు మధ్య వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. ఈ రైలు గురువారం తిరుపతి నుంచి బయలుదేరుతుంది. చిక్ మంగళూరు నుంచి శుక్రవారం బయలుదేరి తిరుపతి చేరుకుంటుంది. అధికారికంగా ఈ రైలు నెంబర్లు 17423–17424గా నిర్ణయించారు. రైలు ప్రారంభం, షెడ్యూల్, టైమింగ్స్ తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు రైల్వేశాఖ అధికార వర్గాల సమాచారం. ఈ రైలు మొదటి విడతగా వారానికోసారి నడపనుంది. తరువాత ప్రజల స్పందన మేరకు వారంలో మూడు సార్లు నడిపే అవకాశాలను పరిశీలిస్తామని రైల్వేశాఖ తెలిపింది.

**ప్రయాణికులకు అనుకూలం**

ఈ రైలు ప్రయాణించే మార్గంలో ముఖ్యమైన ప్రాంతాలు పాకాల, చిత్తూరు, కాట్పాడి, జోలార్‌పేట, కుప్పం, బంగారుపేట, వైట్‌ఫీల్డ్, కృష్ణరాజపురం, బెంగళూరు ఎస్ఎంవీబీ, తుంకూరు, తిప్టూరు, అరిసికెరె, బిరూర్, కదూర్, బిసలె హళ్లి, శంకరాయ పట్న స్టేషన్లు ఉంటాయి. ఈ ప్రాంతాల ప్రజలకు ఈ రైలు సౌకర్యవంతంగా మారనుంది. ఈ రైలుకు పాకాల స్టేషన్ స్టాపింగ్ ఇవ్వడం మరో విశేషం. చిత్తూరు, కుప్పం, బంగారుపేట ప్రజలకు అనుకూలంగా ఉంటుంది.

### టైలరింగ్‌పై మహిళలకు ఉచిత శిక్షణ

**చంద్రగిరి:** యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ చంద్రగిరిలో ఈ నెల 25వ తేదీ (మంగళవారం) నుంచి 30 రోజుల పాటు పురుషులకు సెల్‌ఫోన్ రిపేరు, సర్వీసింగ్‌లపై ఉచిత శిక్షణ ప్రారంభించనున్నట్టు సంస్థ డైరెక్టర్ పి.సురేష్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 45 ఏళ్ల పురుషులు అర్హులన్నారు. కనీస విద్యార్హత 10వ తరగతి ఉండాలని తెలిపారు. మరిన్ని వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలోకానీ, 79896 80587, 94949 51289, 63017 17672 నంబర్లను కానీ సంప్రదించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

### డేటీ ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో ఉచిత శిక్షణ

**తిరుపతి సిటీ:** ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ కార్యాలయం ఆధ్వర్యంలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ కోర్సులో నిరుద్యోగులకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు కార్యాలయ అధికారి టి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణత ఆపైన విద్యార్హతలు కలిగి 18 నుంచి 35 ఏళ్ల లోపు ఉన్న మహిళ, పురుష అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 14వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్‌తో పాటు మరిన్ని వివరాల కోసం 95338 89902 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

# వైఎస్సార్‌సీపీలో నియామకాలు

**చిత్తూరు కార్పొరేషన్:** వైఎస్సార్‌సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అనుబంధ విభాగంలో నియామకాలకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా రైతు విభాగం కమిటీ ఉపాధ్యక్షులుగా వెంకటరమణ రాజు(నగరి), రాఘవరెడ్డి (పుంగనూరు), సోమరెడ్డి (కుప్పం), ప్రధాన కార్యదర్శులుగా బాలసుబ్రమణ్యం(తిరుపతి), సురేంద్రరెడ్డి (జీడీనెల్లూరు), వాయలా మనోహర్‌రెడ్డి (శ్రీకాళహస్తి), నీలరాజ్ (చిత్తూరు), నాగిరెడ్డి(పుంగనూరు), సుధీర్‌రెడ్డి (నగరి), పురుషోత్తంరెడ్డి (కుప్పం), సంతానరాజు (కుప్పం), మాధవ్‌నాయుడు(చంద్రగిరి), వేణుగోపాల్‌రెడ్డి (చంద్రగిరి), కార్యదర్శులుగా సుబ్రమణ్యంరెడ్డి (చంద్రగిరి), పెరుమాళ్ బుజ్జిరెడ్డి(తిరుపతి), సుబ్రమణ్యం (జీడీనెల్లూరు), రవియాదవ్ (చిత్తూరు), శంకరప్ప(పలమనేరు), ఏలుమలైరెడ్డి (నగరి), ప్రమోద్‌రెడ్డి (పుంగనూరు), ఎర్రంరెడ్డి (పుంగనూరు), ఈసీ మెంబర్లుగా నరసింహులు(నగరి), మనోహర్ (జీడీనెల్లూరు), నోబెల్‌కుమార్ (చిత్తూరు), రమేష్ (పలమనేరు), మధురాజు(నగరి), సుబ్రమణ్యంరెడ్డి (నగరి), బాబురెడ్డి (నగరి), రెడ్డెప్ప (చంద్రగిరి), రామ్మూర్తి(చంద్రగిరి), గురుస్వామిరెడ్డి(చంద్రగిరి), జయచంద్రనాయుడు (సత్యవేడు), చంగరాయరెడ్డి (సత్యవేడు), దేవరాజు(సత్యవేడు), వెంకటకృష్ణారెడ్డి (శ్రీకాళహస్తి), దామోదర్‌రెడ్డి(శ్రీకాళహస్తి)ని నియమించింది.

# అర్జీలకు పరిష్కారం చూపండి



శ్మశానాన్ని ఆక్రమించారంటూ బుసపాళెం ఎస్టీకాలనీ వాసులు ఆవేదన



అధికారులకు వినతిపత్రం ఇస్తున్న భారతీయ అంబేడ్కర్ సేన నేతలు

**తిరుపతి అర్బన్:** కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి అర్జీకి పరిష్కారం చూపించే దిశగా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌కు ఆయనతోపాటు కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, డీఆర్వో నరసింహులు హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా ప్రజల నుంచి 284 అర్జీలు వచ్చాయి. అందులో రెవన్యూ సమస్యలపై 149 అర్జీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

- మదనపల్లిలో బుద్ధ భగవాన్ విగ్రహ తలను నరికిన వారిపై వెంటనే చర్యలు చేపట్టాలని భారతీయ అంబేడ్కర్ సేన రాష్ట్ర నేతలు పాలకుంట శ్రీనివాసులు, మల్లారపు వాసు డిమాండ్ చేశారు. ఆ మేరకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోజ్‌మాండ్‌కు వినతిపత్రాన్ని అందించారు.
- వెంకటగిరి మండలం బుసపాళెం ఎస్టీకాలనీకి చెందిన పలువురు యానాదులు తమ శ్మశానాన్ని కబ్జా చేశారని, కాపాడాలని మొరపెట్టుకున్నారు. కలెక్టరేట్‌లో అధికారులను కలసి వారికి వినతిపత్రాన్ని అందించారు. ఇప్పటికే పలు సార్లు స్థానిక అధికారులకు అర్జీలు ఇచ్చామని, ఫలితం లేకపోవడంతో కలెక్టరేట్‌కు వచ్చామని తెలియజేశారు.

# శ్రీకాళహస్తి పెద్దాస్పత్రిలో రక్తపాతం





శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో కర్రలతో దాడులకు తెగబడుతున్న యువకులు

- అధికార పార్టీకి చెందిన ఇరువర్గాల దాడులు
- ఐదుగురికి తీవ్ర గాయాలు
- భయభ్రాంతులకు గురైన సిబ్బంది
- ఏ పార్టీకి సంబంధం లేదంటూ డీఎస్పీ ప్రకటన

**సాక్షి టాస్క్ ఫోర్స్:** అర్ధరాత్రి వేళ పెద్దాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వర్గానికి చెందిన వారిపై, మరో వర్గం యువకులు దాడి చేయడంతో క్యాజువాలిటీ విభాగం రక్తంతో తడిచింది. ఏం జరుగుతోందో అర్థం కాక వైద్య సిబ్బంది, సెక్యూరిటీ గార్డులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ భయానక ఘటన ఆదివారం అర్ధరాత్రి శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో చోటుచేసుకుంది. ఏరియా ఆసుపత్రి సీసీ కెమెరాలో నమోదైన దాడి దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరలయ్యాయి. వివరాల్లోకి వెళితే..

శ్రీకాళహస్తిలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి అగ్నిగుండ మహోత్సవం సందర్భంగా పట్టణంలోని మంచినీళ్లగుంట, వీఎం పల్లికి చెందిన యువకుల మధ్య ఆదివారం రాత్రి వాగ్వాదం చోటుచేసుకుంది. అగ్నిగుండ ప్రవేశం ముగిసిన అనంతరం అర్ధరాత్రి వేళ, తొట్టంబేడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో మంచినీళ్ళ గుంట, వీఎంపల్లికి చెందిన యువకులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. మంచినీళ్లగుంటకు చెందిన ఇద్దరు యువకులు గాయపడ్డారు. గాయపడిన వారిని ఏరియా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మరికొంత మందిని వెంట తీసుకొచ్చిన వీఎం పల్లి యువకులు ఏరియా ఆస్పత్రి క్యాజువాలిటీ విభాగంలోకి చొరబడి చికిత్స పొందుతున్న యువకులు, వారి బంధువులపై కర్రలు, మారణాయుధాలతో దాడికి తెగబడ్డారు. ఈ దాడిలో మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో మంచినీళ్ల గుంటకు చెందిన వారు కూడా తిరగబడి రాళ్లు రువ్వడంతో అక్కడి నుంచి పారిపోయారు. ఈ సమయంలో వీఎంపల్లికి చెందిన యువకుల ద్విచక్రవాహనాన్ని ధ్వంసం చేశారు. పెట్రోలు పోసి తగులబెట్టే ప్రయత్నంలో ఉండగా ఆసుపత్రి సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. అయితే దాడులకు పాల్పడింది టీడీపీకి చెందిన యువకులు కావడంతో ఆస్పత్రి అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది ఎవరూ స్పందించడం లేదు. ఏం జరిగింది అనేది చెప్పడానికి కూడా ముందుకు రావడం లేదు.

**శాంతిభద్రతల వైఫల్యం**

ఆస్పత్రిలో రెండు వర్గాలు దాడులు చేసుకుంటుంటే ఆ సమయంలో పోలీసు టోల్ ఫ్రీ నంబర్లకు కాల్ చేసినా స్పందన లేదని ఆసుపత్రి ఉద్యోగి ఒకరు చెప్పారు. రెండు దశాబ్దాల్లో ఈ తరహా ఘటనలు ఎన్నడూ చూడలేదని చెప్పారు. తెలుగుదేశం పార్టీకి చెందిన రెండు వర్గాల మధ్య దాడి జరిగితే, ఈ సంఘటన ఏ పార్టీకి సంబంధం లేదంటూ డీఎస్పీ నరసింహమూర్తి ప్రకటించడం గమనార్హం. వారి పైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు డీఎస్పీ వివరించారు.

### టీటీడీ ఈవో విస్తృత తనిఖీలు



తనిఖీ చేస్తున్న ఈవో శ్యామల రావు

**తిరుమల:** తిరుమలలో సోమవారం సాయంత్రం టీటీడీ ఈవో శ్యామలరావు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. శ్రీవారి పుష్కరిణి, బంగారు డాలర్ల విక్రయ కౌంటర్, అగరబత్తి, కొబ్బరికాయలు విక్రయ కౌంటర్లు, పబ్లికేషన్ స్టాళ్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. లడ్డూ కౌంటర్, పబ్లికేషన్ స్టాళ్లు, బంగారు డాలర్ల విక్రయ కేంద్రంలో జరుగుతున్న డిజిటల్ పేమెంట్స్‌ను ఆయన పరిశీలించారు. కొబ్బరికాయల కౌంటర్ వద్ద డిజిటల్ పేమెంట్స్ చేసేందుకు భక్తులు ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించారు. ఈ సమస్యను పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఈవో ఆదేశించారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.




**బంగారం :**

| | |
|---|---|
| 24 క్యారెట్లు 10 గ్రాములు | రూ.99,630 |
| 22 క్యారెట్లు ఒక గ్రాము | రూ.9,010 |
| **వెండి:** | |
| హోల్‌సేల్ ధర (కిలో) | రూ.1,10,400 |
| రిటైల్ వెండి గ్రాము | రూ.113.40 |

## క్లుప్తంగా

### లారీని ఢీకొన్న కారు


రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న కారు ముందు భాగం

**పెళ్లకూరు:** లారీని కారు ఢీ కొనడంతో దంపతులకు స్వల్ప గాయాలైన సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు చెన్నై నుంచి శ్రీకాళహస్తి వైపు వెళుతున్న కారు టెంకాయతోపు గ్రామం ప్లై ఓవర్ మీద ముందు వెళుతున్న లారీని ఢీకొంది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న అక్కగారిపేటకు చెందిన రవినాయుడు దంపతులకు స్వల్పగాయాలయ్యాయి. కారు ముందు భాగం ధ్వంసమైంది. సమాచారం అందుకున్న హైవే మొబైల్ కానిస్టేబుల్ మైఖేల్ సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు.

### రైలు కింద పడి ఎస్‌ఐ దుర్మరణం


పోలయ్య (ఫైల్)

**సైదాపురం:** రైలు కింద పడి మండలానికి చెందిన ఎస్‌ఐ దుర్మరణం పాలు కావడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని అనంతమడుగు గ్రామానికి చెందిన పద్దాల పోలయ్య సీఐఎస్‌ఎఫ్ చైన్నై విభాగంలో ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్నారు. పోలయ్యకు భార్య రమాదేవితో పాటు ఇద్దరు పిల్లలున్నారు. చదువుల నిమిత్తం ఆయన గూడూరులోనే కాపురం ఉంటున్నారు. సీఐఎఫ్ఎస్‌లో కానిస్టేబుల్‌గా చేరిన పోలయ్య ఇటీవలనే ఎస్‌ఐగా ఉద్యోగోన్నతి పొందారు. ఆదివారం డ్యూటీ నిమిత్తం చైన్నైకు చేరుకున్నారు. ఎగ్మూర్ రైల్వేస్టేషన్‌లో దిగి లోకల్ ట్రైన్‌లో సీఐఎస్‌ఎఫ్ కార్యాలయానికి బయల్దేరారు. అక్కడ రైలు దిగే సమయంలో రైలు కింద పడి దుర్మరణం చెందారు. దీంతో అక్కడే కేసును నమోదు చేసి సోమవారం సాయంత్రం చైన్నైకు చెందిన సీఐఎస్‌ఎఫ్ అధికారులు పోలయ్య మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.



# విద్యా ప్రదాత వైఎస్సార్

- ఆయన హయాంలోనే వెటర్నరీ వర్సిటీ
- రైతు బాంధవుడిగా ప్రజల్లో చెరగని ముద్ర
- తిరుపతి వేదిక్ వర్సిటీ నెలకొల్పిన మహనీయుడు వైఎస్సార్
- నేడు వైఎస్సార్ 76వ జయంతి సందర్భంగా ఆయన సేవల స్మరణ

**తిరుపతి సిటీ:** ప్రతి పేదవాడి ఇంటిలో డాక్టర్, ఇంజినీర్ ఉండాలని కలలు కన్న పేదల పక్షపాతి వైఎస్సార్. బడుగు బలహీన వర్గాలు ఉన్నత చదువులకు దూరం కాకూడదనే లక్ష్యంతో విద్యారంగంలో నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. దీంతో ఇంజినీరింగ్, మెడికల్ కళాశాల ఏర్పాటుతోపాటు విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు సకాలంలో అందించి ప్రోత్సహించారు. దీంతో పేదింటి పిల్లలు కూడా ఉన్నత చదువులు అభ్యసించి దేశ, విదేశాల్లో స్థిరపడ్డారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాడి పరిశ్రమ అభివృద్ధికి ఎనలేని కృషి చేసి రైతు బాంధవుడిగా తెలుగు ప్రజల గుండెలలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ, వేదిక్ వర్సిటీలను వైఎస్సార్ మానసపుత్రికలుగా నేటికీ ప్రజలు కొనియాడుతున్నారంటే ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని చెప్పవచ్చు.

**నేడు వైఎస్సార్ జయంతి**

దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డిలేని లోటు రైతులకు స్పష్టంగా కనిపిస్తోంది. ఆయన చలవతో పశువైద్య విద్యను అభ్యసించిన పేద విద్యార్థులు సైతం నేడు ఉన్నతస్థాయిలో రాణిస్తున్నారు. నేడు వారంతా వైఎస్సార్ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని గుర్తు చేసుకుంటున్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో ప్రజలు, వైఎస్సార్ అభిమానులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం వైఎస్సార్ 76వ జయంతిని ఘనంగా జరపుకోనున్నారు.



ఎస్వీ వేదిక్ వర్సిటీ ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి (ఫైల్ )

### ఆయన లేని లోటు కనిపిస్తోంది



డాక్టర్ వైఎస్సార్ పేదల పక్షపాతిగా ప్రజలు ఇప్పటికీ కొనియాడుతున్నారు. ఆయన విద్యా రంగంలో చేసిన సంస్కరణలతో ఎంతో మంది పేదల పిల్లలు డాక్టర్లుగా, ఇంజనీర్లుగా దేశ, విదేశాలలో రాణిస్తున్నారు. తిరుపతి జిల్లాను ఎడ్యుకేషన్ హబ్‌గా రూపొందించడంలో ఆయన కృషి ఎనలేనిది. ఆయన లేనిలోటు ప్రస్తుతం తెలుగు ప్రజలకు స్పష్టంగా కనబడుతోంది.
– రామకృష్ణారెడ్డి, రిటైర్డ్ టీచర్, తిరుపతి

### వైఎస్సార్ మా ఇంటిదేవుడు



మాలాంటి పేదలు అందుకోలేని వైద్య విద్యను మాకు దగ్గర చేశారు. వైఎస్సార్ చేపట్టిన సంస్కరణలతో నాకు ఎంబీబీఎస్‌లో సీటు వచ్చింది. తల్లిదండ్రులు కూలికి వెళ్లితేగాని కుటుంబం గడవదు. అటువంటి పరిస్థితి నుంచి అమెరికాలో పేరొందిన ఆస్పత్రిలో డాక్టర్‌గా పనిచేస్తున్నాను. ఇదంతా డాక్టర్ వైఎస్సార్ చలవే. ఆయన్ను మా ఇంటిదేవుడిగా ఇప్పటికీ కొలుస్తున్నాం. – డాక్టర్ కేశవులు, తిరుపతి

### మా ఆరాధ్య దైవం



రెక్కాడితే కాని డొక్కాడని పరిస్థితిలో హోటళ్లలో భార్యాభర్తలు పనిచేస్తుండేవాళ్లం. వైఎస్సార్ హయాంలో మా అమ్మాయికి ప్రభుత్వ కళాశాలలో ఇంజినీరింగ్ సీటు లభించింది. ఆ తరువాత లండన్‌లో ఉద్యోగం రావడంతో అక్కడే స్థిరపడింది. మేము ఆర్థికంగా బలపడ్డాం. మాకు వైఎస్సార్ ఆరాధ్యదైవం. మేము బతికున్నంత కాలం ఆయన సేవలను మరచిపోలేం. – సరస్వతి, గృహిణి, తిరుపతి రూరల్

### ఆయన పేదల పక్షపాతి



పేదల పక్షపాతిగా, రైతు బాంధవుడిగా డాక్టర్ వైఎస్సార్ మా గుండెల్లో నిలిచిపోయారు. ఆయన తీసుకొచ్చిన ఆరోగ్యశ్రీతో జిల్లాలో లక్షలాదిమంది లబ్ధి పొంది ప్రాణాలు కాపాడుకుంటున్నారంటే ఇది వైఎస్సార్ చలువే. విద్యారంగంలో మహిళలకు పెద్ద పీట వేశారు. ఆయన తీసుకొచిచన సంస్కరణలు ఎంతో మంది మహిళలను ఉన్నత స్థానానికి చేర్చాయి. – పద్మావతమ్మ, తిరుపతి

## 22న టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం

**తిరుమల :** టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం ఈ నెల 22వ తేదీన నిర్వహించనున్నట్లు సమాచారం. టీటీడీ ధర్మకర్తల మండలి చైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన ధర్మకర్తల మండలి సభ్యులు స్థానిక అన్నమయ్య భవనంలో సమావేశమై పలు తీర్మానాలు చేయనున్నారు. గతంలో ఆమోదించిన తీర్మానాల అమలు, ప్రగతిని సమీక్షించడంతోపాటు భవిష్యత్తు అభివద్ధి కార్యక్రమాలపై ప్రధానంగా చర్చించనున్నారు.

## పోలీస్ గ్రీవెన్స్‌కు 97 అర్జీలు

**తిరుపతి క్రైం:** తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 97 ఫిర్యాదులు అందినట్టు ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. ఇందులో దొంగతనాలు, ఆస్తి తగాదాలు, ఆర్థికపరమైన లావాదేవీలు ఉన్నాయన్నారు. వెంటనే సంబంధిత అర్జీలు పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.

## రేషన్ షాపులపై విజిలెన్స్ దాడులు

**తిరుపతి క్రైమ్:** నగరంలోని రేషన్ షాపులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కరీముల్లా సోమవారం దాడులు నిర్వహించారు. వచ్చిన ఫిర్యాదుల మేరకు షాప్ నెంబర్ 16ను తనిఖీ చేశారు. దుకాణం గుణసుందరి పేరుపై ఉండగా వినోద్ కుమార్ నడుపుతున్నట్లుగా గుర్తించారు. అక్కడ ఉన్న స్టాకును పరిశీలించగా బియ్యం 430 కిలోలు, చక్కెర 106 కిలోలు అదనంగా ఉన్నట్లు గుర్తించారు. ఆ సరుకును వీఆర్వోకు స్వాధీనం చేశారు. ప్రజలకు చేరాల్సిన బియ్యం అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అలాంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# యథేచ్ఛగా ఇసుక దోపిడీ


అయ్యప్పరెడ్డి పాళెంలో సాగుతున్న ఇసుక అక్రమ రవాణా

**నాయుడుపేటటౌన్:** స్వర్ణముఖి నది నుంచి ఇసుకాసురులు ఇష్టారాజ్యంగా ఇసుకను దోచేస్తున్నారు. అధికార పార్టీ నాయకులు అండదండలు ఉండడంతో అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. స్వర్ణముఖి సమీప గ్రామాలైన అయ్యప్పరెడ్డిపాళెం, మూర్తిరెడ్డిపాళెం, కల్లిపేడు, పండ్లూరు, అన్న మేడు, చిగురుపాడు, తిమ్మాజి కండ్రిగ, తుమ్మూరు , మర్లపల్లి, కాలవ గట్టు, వేముగుంటపాళెంలో ఇసుక యథేచ్ఛగా తరలిపోతోంది. దీన్ని ఎక్కడికక్కడ అరికట్టలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలను ఎవరూ పట్టించుకోవడం లేదు. స్వర్ణముఖి నది కాజ్‌వే వద్ద గేట్లు తీసివేడయడంతో ఇసుక రాత్రి పగలు తేడాలేకుండా తరలిపోతోంది. అధికారులకు నెలవారీ ముడుపులు అందుతుండడంతో పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

# స్కూల్ నుంచి పారిపోయిన పిల్లలు

**రేణిగుంట:** మండలంలోని కరకంబాడిలో ముగ్గురు పిల్లలు తిరుగుతుండగా వారిని రేణిగుంట పోలీసులు వారు విచారించి వారిని మాతృశ్రీ చైల్డ్ హోమ్‌కు అప్పగించారు. తిరుపతి బైరాగి పట్టెడలో ఉన్న మాతృశ్రీ చైల్డ్ హోమ్‌లో ఉంటూ ప్రయివేటు స్కూల్లో చదువుతున్న లంకేష్ (9), సహదేవ (11), ముఖేష్ (12) ఇంగ్లీష్ మీడియం చదవడం కష్టంగా ఉందంటూ పాఠశాల నుంచి పారిపోయారు. వారిని పోలీసులు సోమవారం పోలీస్ స్టేషన్‌కు తీసుకుని వచ్చి విచారించారు.


విద్యార్థులను సంస్థ ప్రతినిధులకు అప్పగిస్తున్న పోలీసులు

అనంతరం మాతృశ్రీ చైల్డ్ హోమ్ వారిని పిలిపించి వారికి అప్పగించారు.

## వాటర్ ప్లాంట్‌పై దాడి


విరిగిపోయిన వాటర్ ప్లాంట్ కొళాయిలు

**పాకాల :** స్థానిక శివశక్తి నగర్‌లోని హేమాద్రి మినరల్ వాటర్ ప్లాంట్‌పై దాడి చేసిన ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. బాధితురాలు యోగిత కథనం మేరకు బ్యాంకు రుణం పొంది శివశక్తి నగర్‌లో వాటర్ ప్లాంట్ నిర్వహిస్తున్నారు. ఇది గిట్టని పక్కింటి వారు రోజూ ఆమెతో గొడవ పడుతున్నారు. ఉదయం వాటర్‌ప్లాంట్‌పై రాళ్లతో దాడి చేశారు. ఇంటి కిటికీ అద్దాలు పగులగొట్టారు. కొళాయిలను విరగ్గొట్టారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడానికి యోగిత స్కూటీపై బయల్దేరింది. దీంతో ఆమెను పక్కను నెట్టేసి, స్కూటర్‌ని కింద పడేసి ధ్వంసం చేశారు. ఈ మేరకు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.


ధ్వంసమైన స్కూటర్

## నాయుడుపేట ఎల్‌ఐసీలో రూ.19.87 లక్షలు గోల్‌మాల్

- పాలసీదారునికి చెల్లించాల్సిన క్లెయిమ్ అదే పేరుతో ఉన్న మరొకరి ఖాతాలోకి

**నాయుడుపేటటౌన్:** పట్టణంలోని ఎల్‌ఐసీలో పాలసీదారునికి సంబంధించిన క్లెయిమ్ రూ.19.87 లక్షలు గోల్‌మాల్ జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాలసీదారుకు చెల్లించాల్సిన నగదును అదే పేరుతో అదే ఊరిలో ఉన్న మరొక వ్యక్తి ఖాతాలో వేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు, పెళ్లకూరు మండలం జీలపాటూరుకు చెందిన ఆరూరు వెంకటేశ్వర్లు నాయుడుపేట ఎల్‌ఐసీ బ్రాంచిలో పాలసీ తీసుకున్నారు. ఆయన తీసుకున్న బీమా పాలసీకి సంబంధించి 2025 జూలై 27 తేదీకి మెచ్యూరిటీ వచ్చి రూ.19.87 లక్షలకు పైగా నగదు అతనికి రావాల్సి ఉంది. దీంతో గత నెల 19వ తేదీ నాడే ఆరూరు వెంకటేశ్వర్లు పాలసీ మెచ్యూరిటీకి సంబంధించిన ప్రక్రియను పూర్తి చేశారు. అయితే ఆరూరు వెంకటేశ్వర్లు పేరుతోనే జీలపాటూరు గ్రామంలో మరో వ్యక్తి ఉన్నాడు. ఎల్‌సీఐ నుంచి నగదు వస్తుందని తెలుసుకున్న ఆ వ్యక్తి, తన పేరూ అదే కాబట్టి దాన్ని కాజేసేందుకు పథకం వేశాడు. ఎల్‌ఐసీ ఏజెంట్‌తో కలసి ఎల్‌ఐసీ అధికారులను బురిడీ కొట్టించాడు. జూలై 27వ తేదీ కంటే ముందుగానే ఆరూరు వెంకటేశ్వర్లు బ్యాంకు ఖాతాకు నగదు జమ చేయించుకున్నాడు. అయితే 27వ తేదీ బ్యాంకు ఖాతాలో నగదు పడుతుందని ఎదురుచూసిన అసలైన పాలసీదారు ఈ నెల 1వ తేదీ ఎల్‌ఐసీ కార్యాలయాన్ని సంప్రదించారు. అక్కడ గత నెలలోనే నగదు మొత్తం చెల్లించామని చెప్పడంతో అవాక్కయ్యారు. అప్పుడు ఎల్‌ఐసీ అధికారులు బ్యాంకు ఖాతాలు పరిశీలించడంతో రూ.19,87,500 అదే పేరుతో ఉన్న మరొకరి ఖాతాలో జమ అయినట్లు తెలుసుకున్నారు.

### వడ్డీతో సహా పూర్తి నగదు చెల్లిస్తాం

నాయుడుపేట ఎల్‌ఐసీలో బీమా చేసిన పాలసీదారునికి ఎల్‌ఐసీ నుంచి రావాల్సిన రూ.19,87,500 నగదును 9 శాతం వడ్డీతో సహా చెల్లిస్తాం. ఒకే పేరుతో అదే ఊరిలో ఇద్దరు ఉన్నందున ఈ నగదును మరో వ్యక్తి కాజేసినట్లు తెలిసింది. కార్యాలయంలో జరిగిన అవకతవకలపై చట్టపరమైన చర్యలు చేపడతాం.
– సుధీర్‌బాబు, ఎల్‌ఐసీ బ్రాంచి మేనేజర్, నాయుడుపేట

## అనారోగ్యంతో టీటీడీ ఉద్యోగి మృతి

**తిరుపతి క్రైమ్:** టీటీడీలో పని చేస్తున్న ఓ ఉద్యోగి అనారోగ్యంతో మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఈస్ట్ పోలీసుల కథనం మేరకు, టీటీడీలో అసిస్టెంట్ షరబ్‌గా నిధులు నిర్వర్తిస్తున్న హేమ కుమార్ భార్యతో కలిసి కొర్లగుంటలో నివాసం ఉంటున్నాడు. అనారోగ్యంతో ఉన్న వ్యక్తి చికిత్స పొందుతున్నాడు. ఇంట్లో విశ్రాంతి పొందుతున్న సమయంలో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు వెంటనే స్విమ్స్‌కు తరలించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం హేమకుమార్ మృతి చెందినట్లుగా డాక్టర్లు నిర్ధారించారు. భార్య గాయత్రి ఫిర్యాదు మేరకు ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్ వి మెడికల్ కళాశాలకు తరలించారు.

## శ్రీవారి సేవలో తమిళనాడు గవర్నర్


తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవికి స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న టీటీడీ చైర్మన్


తిరుమల ఆలయం వెలుపల మాజీ డీజీపీ ఆర్పీ ఠాకూర్

**తిరుమల:** తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు గవర్నర్‌కు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ చైర్మన్ లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. అంతకు ముందు మాజీ డీజీపీ ఆర్పీ ఠాకూర్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

## తిరుపతిలో సైకో వీరంగం

- కర్రతో ముగ్గురిపై దాడి
- ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు


సైకో దాడిలో మృతి చెందిన యాచకుడు శేఖర్


సైకోను తీసుకెళ్తున్న పోలీసులు

**తిరుపతి క్రైమ్:** తిరుపతి నగరంలో సోమవారం ఓ సైకో కర్రతో దాడిచేశాడు. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అలిపిరి ఎస్‌ఐ లోకేశ్ వివరాల మేరకు.. కపిలతీర్థం రోడ్డులో సోమవారం ఓ వ్యక్తి సైకోలా ప్రవర్తించి తనకు ఎదురుపడినవారిపై దాడి చేశారు. అక్కడున్న యాచకుడు శేఖర్ (55), వాహనాల పార్కింగ్‌లో పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం, కల్పనపై కర్రతో విచక్షణారహితంగా దాడిచేశాడు. స్థానికులు వెంటనే గాయపడ్డ వ్యక్తులను రుయా ఆసుపత్రికి తరలించారు. వీరిలో శేఖర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మరో ఇద్దరు చికిత్స పొందుతున్నారు.

**వల వేసి.. బంధించి**

అంతటితో ఆగని సైకో గంటపాటు పోలీసులకు, స్థానికులకు చుక్కలు చూపించాడు. రోడ్లపై వీరవిహారం చేస్తూ అందరినీ భయభ్రాంతులకు గురిచేశాడు. మొదట కపిలతీర్థం నుంచి మున్సిపల్ పార్క్ వరకు కర్రతో వీరంగం చేశాడు. అతన్ని చూసి స్థానికులంతా పరుగులు తీశారు. సైకో దృఢంగా ఉండడంతో అతన్ని అదుపులోకి తీసుకోవడానికి ఎవరూ సాహసించలేకపోయారు. చివరికి మున్సిపల్ సిబ్బందితో కలసి ఎస్‌ఐ లోకేశ్, కానిస్టేబుల్ స్వయంప్రకాశ్ వల వేసి చాకచక్యంగా బంధించారు. సైకో వద్ద కత్తి కూడా ఉందని, అతను తమిళనాడుకు చెందిన వ్యక్తిగా ప్రాథమికంగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.

# రాయితీ రుణాలకు ఎదురుచూపులు

- నాలుగు నెలలు దాటినా జాడ లేని రుణాలు
- తమ వారికే రుణాలు అందేలా కూటమి ఆదేశాలు
- సిబిల్ స్కోర్ లేదని తిరస్కరించిన బ్యాంకులు
- జిల్లాలో స్వయం ఉపాధి రుణాల ఊసే లేదు


నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న బ్యాంకు అధికారులు (ఫైల్ )

| కార్పొరేషన్ | యూనిట్లు | దరఖాస్తులు | కేటాయింపులు | రాయితీ | రుణం |
|---|---|---|---|---|---|
| ఎస్సీ | 1,267 | 6, 284 | రూ 52.89 కోట్లు | రూ 20.88 కోట్లు | రూ 29.36 కోట్లు |
| బీసీ | 2,082 | 17,487 | రూ 50.14 కోట్లు | రూ 25.07 కోట్లు | రూ 25.07 కోట్లు |

**చిల్లకూరు:** తప్పుడు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అటు ఉద్యోగాలు చూపక, ఇటు నిరుద్యోగ భృతి ఇవ్వక, కార్పొరేషన్‌ల ద్వారా రాయితీ రుణాలు మంజూరు చేయక యువతకు మొండి చేయి చూపిస్తోంది. దరఖాస్తు చేసుకోండి నెల రోజుల్లో రాయితీ రుణాలు అందిస్తామంటూ ఓ ప్రకటన ఇచ్చారు. అంతే ప్రతి పంచాయతీ నుంచి దరఖాస్తులు వెల్లువెత్తాయి. దీంతో మండల స్థాయి అధికారులు వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి తమకు అనుకూలమైన వారిని ఎంపిక చేయాలని కూటమి నాయకులు ఆదేశాలు జారీ చేశారు. వారిని ఎంపిక చేసి దరఖాస్తులను ఆయా బ్యాంకులకు మండల అధికారులు పంపారు. అయితే బ్యాంకు అధికారులు కూడా తామేం తక్కువ కాదని పంపిన దరఖాస్తుదారుల సిబిల్ స్కోర్ లేదని ఆ దరఖాస్తులను తిరిగి పంపేశారు. దీంతో తమ వారికి రాయితీ రుణాలు ఇప్పించే పరిస్థితి కనిపించక పోవడంతో రుణాల మంజూరుకు అడ్డుకట్ట వేసినట్లు తెలుస్తోంది.

**నాలుగు కార్పొరేషన్ల ద్వారా రాయితీ రుణాలు**

జిల్లాలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా రాయితీ రుణాలు ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అయితే అర్హులైన వారు ఎంతో మంది ఉన్నప్పటికి తమకు అనుకూలంగా వ్యవహరించే వారికే రుణాల మంజూరులో ప్రాధాన్యత ఇచ్చేందుకు మొగ్గు చూపించారు. అయితే బ్యాంకు అధికారులు సిబిల్ స్కోర్ లేని వారు రాయితీ రుణాలకు అనర్హులంటూ ఆ దరఖాస్తులను తిరస్కరించారు. దీంతో తమకు అనుకూలమైన వారు అనర్హులు కావడంతో మరొకరికి ఆ రుణాలు ఇవ్వకూడదంటూ అధికారులపై ఒత్తిడి తేవడంతో వారు మిన్నకుండి పోయారు. చివరగా ప్రజాప్రతినిధులు కార్పొరేషన్ రాయితీ రుణాలపై మరోమారు మార్గదర్శకాలు ఇచ్చే వరకు తాత్కాలికంగా నిలిపి వేయాలని మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. దీంతోనే నాలుగు నెలలవుతున్నా రాయితీ రుణాల ఊసే ఎత్తడం లేదు.

–ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రెండు వర్గాల వారికే రుణాలు ఇస్తుండగా బీసీ కార్పొరేషన్ ద్వారా బ్రాహ్మణ, ఈబీసీ, కమ్మ, క్షత్రియ, రెడ్డి, వైశ్య, కాపులకు రాయితీ రుణాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. ఇందులో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా తిరుపతి జిల్లాలో 1,267 , బీసీ కార్పొరేషన్ ద్వారా 2,082 యూనిట్లు మంజూరు చేయనున్నారు. ఇందుకు సంబంధించి దరఖాస్తులను ఇప్పటికే బ్యాంకులకు పంపిన జాబితాలో ఎంపికైన వారు బ్యాంకు అధికారులను కలుసుకుని అవసరమైన గ్యారంటీలు ఇచ్చేందుకు సిద్ధపడ్డారు. అయితే అందరికీ ఒకేసారి రుణాలు మంజూరు చేయాలని ఆదేశాలు రావడంతో అధికారులు మిన్నకుండిపోయారు.

### నిరుద్యోగ భృతి ఇవ్వరు

కార్పొరేషన్‌ల ద్వారా రాయితీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో ఎక్కువ శాతం మంది ఉద్యోగ అవకాశాలు దక్కక పోవడంతో కనీసం వయస్సు మీరేలోగా ప్రభుత్వం ద్వారా ఉపాధి అయినా పొందుతామనుకుని దరఖాస్తులు చేశారు. అలాంటి నిరుద్యోగులకు అండగా ఉంటామని చెప్పిన కూటమి ప్రభుత్వం వారికి నిరుద్యోగ భృతి కూడా ఇవ్వక పోవడంతో అందరూ నిరాశ చెందుతున్నారు.

### ఆదేశాలు రావాలి

కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాలు ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానించాం. ఇంటర్వ్యూలు నిర్వహించడం పూర్తి చేశాం. అయితే బ్యాంకుల ద్వారా రుణాలు అందించాలనే ఆదేశాలు ప్రభుత్వం నుంచి మాకు రావాల్సి ఉంది. ఆదేశాలు అందిన వెంటనే ఆయా బ్యాంకుల ద్వారా రాయితీ రుణాలు అందిస్తాం.
– చెన్నయ్య, ఇన్‌చార్జ్ ఈడీ, ఎస్సీ కార్పొరేషన్